ఉత్తమ పోలీసులకు అవార్డులు

అవార్డులను అందజేస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, జనవరి 23 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో ఉత్తమ పోలీసులకు అవార్డులను ప్రదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణచివేయాలని సూచించారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని అన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేరాలు జరగకుండా ప్రో యాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో తదితర కేసుల్లో 60 రోజుల్లోగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి తప్పకుండా కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రతి నెలా రివార్డులు, అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకింగ్ వచ్చేలా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించాల న్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమం లో ట్రైనింగ్ ఐపీఎస్ కాజోల్ సింగ్, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు ప్రకాశ్, శ్రీనివాస్, జగనాథరెడ్డి, మదన్‌లాల్, శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ తొలగింపుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

రాజంపేట్, జనవరి 23 : రాజంపేట సొసైటీ చైర్మన్‌గా నల్లవెల్లి అశోక్ తొలగింపుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జిల్లా సహకార అధికారి రాజంపేట సొసైటీ చైర్మన్‌గా నల్లవెల్లి అశోక్‌ను చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే దీనిపై నల్లవెల్లి అశోక్ హైకోర్టును ఆశ్రయించారు. కాగా 2024 ఫిబ్రవరి 19వ తేదీ వరకు సొసైటీ చైర్మన్‌గా కొనసాగవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయనే సొసైటీ చైర్మన్‌గా కొనసాగనున్నారు.

భిక్కనూరు మండలంలోని సౌత్ క్యాంపస్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని స్వీకార్ అకాడమీని మంగళ వారం సందర్శించారు.

–భిక్కనూరు,జనవరి 23

ప్రణాళికతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమే..

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జనవరి 22 : ప్రణాళి కతో కృషి చేస్తే ఏదైనా సాధించవ చ్చని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలో షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, గిరిజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సంద ర్భంగా ప్రేరణ తరగతులను నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. పదోతరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు సమ యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచిం చారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధి కారిణి రజిత, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధి కారి శ్రీనివాస్, ఇతర అధికారులు వెంకటేశ్, యాదగిరి తది తరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన

ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా గుగూల్ ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ అయ్యే విధానంపై వివ రించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని పట్టుకొని ఆ వివరాలు, తనిఖీ చేసే పద్ధతిపై జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ స్టాటిస్టికల్ టీమ్ అధికారులకు తెలిపారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వేలెన్స్ స్టాటిస్టికల్ టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనాల తనిఖీలో నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను టీం సభ్యులు పరి శీలించి, పట్టుకోవాలని చెప్పారు. తనిఖీలో మద్యం దొరికితే ఎక్సైజ్ అధికారులకు అప్పగించాలని సూచించారు. పట్టుబ డిన నగదు వివరాలను నోడల్ అధికారులకు తెలియజేయా లని చెప్పారు. తనిఖీ బృందాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, సీపీవో రాజారాం, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల తనిఖీ బృందాల అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 23 : జిల్లాలోని మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం నిర్వహించారు. పలు చౌరస్తాలు, కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలు, విగ్రహాలకు యువజన సంఘాల నాయకులు, బజరంగ్‌దళ్, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, యువకులు

నస్రుల్లాబాద్ మండలం సంగెం తండాలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహిళా సమాఖ్య సమావేశం

రాజంపేట్, జనవరి 23 : రాజంపేట మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం గురించి అవగాహన కల్పించారు. బ్యాంకు లింకేజీ అధికారి రవీందర్ మాట్లాడుతూ.. మండలంలో రూ.21 కోట్ల బ్యాంకు రుణాలు, మహిళా ఆరోగ్య సంబంధిత విషయాలు, లింగ వివక్షతపై మహిళా సభ్యులకు అవగాహన కల్పిం చారు. సంఘాల్లో ఓవర్ డ్యూ, ఎన్‌పీఏ లేకుండా చూడాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ అధికారిణి శారద అన్నారు.

మాట్లాడుతున్న డీపీఎం రమేశ్‌బాబు

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష, జరిమానా

బీబీపేట్, జనవరి 23: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయ మూర్తి ప్రతాప్ జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలి పారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బీబీ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు శిక్షతోపాటు రూ.300 జరిమానా విధించినట్లు చెప్పారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడుపొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

బాన్సువాడ రూరల్, జనవరి 23 : మండలం లోని బోర్లం క్యాంపు తండాకు చెందిన డుంగా వత్ ధానిబాయి(48) పాముకాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధానిబాయి ఈ నెల 19న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురి కాగా చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తర లించినట్లు తెలిపారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నిజామా బాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వారు వివరించారు.

షబ్బీర్‌అలీని కలిసిన నాయకులు



షబ్బీర్‌అలీని కలిసిన నాయకులు మాచారెడ్డి మండల నాయకులు

మాచారెడ్డి/బీబీపేట్/కామారెడ్డి, జనవరి 23 : రాష్ట్ర ప్రభు త్వం షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించ డంతో పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, కాకులగుట్ట తండా, ఘన్‌పూర్, బీబీపేట్ గ్రామాల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని షబ్బీర్ అలీ నివాసంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్ర మంలో అలీఖాన్, బన్సీలాల్, సతీశ్, బీబీపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుతారి రమేశ్ తదితరులు ఉన్నారు. తెలం గాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాంతి వెస్లీ షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ స్థితిగతులు, భవిష్యత్తు కార్యచరణపై చర్చించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వినతి

డీఈవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, జనవరి 23 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పాతుకపోయిన పలువురు అధికారులపై చర్యలు తీసుకోవాల ని డీఈవో కార్యాలయంలో విద్యార్థి సంఘ నాయకులు డీఈవో రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి గంజ్ పాఠశా లలో పనిచేసే నీలం లింగం అనే హెచ్ఎం కొన్ని నెలలుగా పాఠ శాల ముఖం చూడడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకురావడంతో పాఠశాలను సందర్శించా మన్నారు. అక్కడ నిజంగానే సదరు హెచ్ఎం విధులకు హాజ రుకావడం లేదని గుర్తించి పాఠశాలలో ఆరా తీయగా విద్యా శాఖ కార్యాలయంలోనే ఉంటాడనే విషయం తెలిసిందన్నారు. సదరు హెచ్ఎం ఏసీజీఈగా విధులు నిర్వహిస్తాడని, కేవలం పరీక్షల సమయంలో తప్ప మిగిలిన సమయంలో పాఠశాల లోనే ఉండాల్సి ఉన్నా విద్యాశాఖ కార్యాలయంలోనే ఉంటు న్నాడని అన్నారు. డీఈవో అతనిపై చర్యలు తీసుకొని పాఠశా లలో కొనసాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఐరేని సందీప్, నరేందర్, విఠల్, అరుణ్, భరత్, రోషన్, ఫణి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డి, జనవరి 23: నాగిరెడ్డిపేటలోని ఆదర్శ పాఠశాలను జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. భోజనం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని విద్యార్థులు ఆయనకు వివరించారు. ప్రతిరోజూ గుడ్డు పెట్టడం లేదని తెలిపారు. డైనింగ్ హాల్ లేకపో వడంతో చెట్ల కిందనే భోజనం చేస్తున్నామని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఆయనవెంట ఎస్ ఎంసీ చైర్మన్ దివిటి కిష్టయ్య, ప్రిన్సిపాల్ శ్రీలత ఉన్నారు.

ఇష్టపడి చదివితేనే మంచి అవకాశాలు

ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి సలాం

మాట్లాడుతున్న ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి సలాం

ఎల్లారెడ్డి, జనవరి 23: కళాశాల స్థాయి నుంచి ఇష్ట పడి చదివిన ప్రతి విద్యార్థికీ మంచి అవకాశాలు వస్తాయని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి సలాం అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కలె క్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశాల మేరకు మంగళవారం జాబ్ మేళాను నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజ రైన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇంటర్ పూర్తి కాగానే ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులకే ఇప్పుడు సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు వస్తున్నాయని, కానీ హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతి నిధులు వచ్చి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం విద్యార్థుల అదృష్టమని అన్నారు. కంపెనీ ప్రతినిధులు ప్రత్యే కంగా శిక్షణ ఇచ్చి నేరుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ హేమచందర్, పలువురు కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ రాజుపాటిల్

డోంగ్లీ, జనవరి 23: మండలంలోని మాదన్‌హిప్పర్గాలో యువకులకు స్పోర్ట్స్ కిట్లను సర్పంచ్ రాజు పాటిల్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడలతో యువకుల్లో కొత్త ఉత్సాహం ఏర్పడుతుం దని అన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్య దర్శి సతీశ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు..

పిట్లం, జనవరి 23: మండలకేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్ షఫీ, ఎంఈవో దేవీసింగ్ కలిసి మంగ శవారం మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. రానున్న వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థీ వంద శాతం మార్కులు సాధిం చాలని అన్నారు. మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఉపాధ్యాయుడు సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్, జనవరి 23 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష కామారెడ్డి ఆధ్వర్యంలో ది వ్యాంగ విద్యార్థులకు మంగళవారం ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ.. పాఠశాలలో మొత్తం తొమ్మిది మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశామ న్నారు. అనంతరం నస్రుల్లాబాద్ భవిత సెంటర్‌కు వచ్చిన వీల్ చైర్‌ను గూడెం మహేందర్ అనే దివ్యాంగ విద్యార్థికి ఎంఈవో నాగేశ్వర్ రావు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరిగె సాయిలు, పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారా యణగౌడ్, సాయిలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి వీల్ చైర్ అందజేస్తున్న ఎంఈవో, నాయకులు

మహ్మద్‌నగర్‌లో భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం

నిజాంసాగర్, జనవరి 23: మహ్మద్‌నగర్ నూతన మండ లంలోని తహసీల్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ సేవలను తహసీల్దార్ క్రాంతికుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ.. రైతులు మీసేవ కేంద్రాల్లో ముందుగా స్లాట్ బుక్ చేసుకుని తహసీల్ కార్యాలయానికి రావాలని సూచిం చారు. అప్పుడు ధరణి వెబ్‌సైట్ సహాయంతో రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వాజిద్ అలీ, గ్రామస్తులు రామాగౌడ్, వెంకట్‌గౌడ్, ఎల్లా రెడ్డి, ధరణి సిబ్బంది ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

కౌలాస్‌కోటను సందర్శించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

దిమ్మె నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, జనవరి 23: జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గణతంత్ర్య దినోత్సవం కోసం కోటలో ఏర్పాటు చేస్తున్న జెండా గద్దెతో పాటు కోటకు వెళ్లే రహదారి పను లను పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయ కులు ఉన్నారు.

వెదజల్లే పద్ధతితో రైతులకు లాభం

రామారెడ్డి, జనవరి 23: రైతులు వెదజల్లే పద్ధతిలో వరిని సాగుచేస్తే లాభం చేకూ రుతుందని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న అన్నారు. రామారెడ్డిలో వెదజల్లే పద్ధతిలో రైతులు సాగుచేస్తున్న వరిని ఆమె మంగళవారం పరిశీలించారు. అక్కడ వరి మడులను చూసి రైతులను అభినందించారు. ఈ సందర్భగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాన్ని పలుమార్లు దమ్ము చేయకుండా వెదజల్లే పద్ధతిలో వరి సాగుచే యాలని సూచించారు. దీంతో కూలీలు అవసరం ఉండరని, పెట్టుబడి ఖర్చు తగ్గు తుందని తెలిపారు. దిగుబడి కూడా బాగా వస్తుందన్నారు. మండల వ్యవసాయా ధికారి సామ హరీశ్‌కుమార్, క్లస్టర్ ఏఈవో రాకేశ్‌కు పలు సూచనలు చేశారు. కార్య క్రమంలో రైతులు ప్రవీణ్, నవీన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఏడీఏ రత్న

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన

బిచ్కుంద, జనవరి 23: జాతీయ బాలి కా సంరక్షణ వారోత్సవాల సందర్భంగా బిచ్కుందలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా 'బేటీ బచావో.. బేటీ పడావో'పై మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది తులసి అవగాహన కల్పిం చారు. బాలికల రక్షణ, చదువు ప్రాము ఖ్యత, నైపుణ్యాలు, బాల్య వివాహాలపై వివరించా రు. కార్యక్రమంలో సీడీపీవో సునంద, ఏపీఎం నాగార్జున్‌సాగర్, సిబ్బంది సౌందర్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సవరించాలి

మద్నూర్, జనవరి 23: ఓటరు జాబితాలో తప్పులను జాగ్రత్తగా సవరిం చాలని తహసీల్దార్ ముజీబ్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో మండ లంలోని బీఎల్వోలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాలో ఒక ఓటరు పేరు రెండు సార్లు నమోదైతే.. ఒక చోట ఉంచి మరో ఓటును తొలగించాలని సూచించారు. మరణించిన వారి పేర్లను కుటుంబ సభ్యుల అనుమతితో తొలగించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఎల్వోలు, అధికారులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బిచ్కుంద, జనవరి 23: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని మోటార్ వెహి కల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలం లోని వాజిద్‌నగర్ గ్రామంలో ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపితే రహదారులు ధ్వంసం అవు తాయని అన్నారు. తప్పకుండా పట్టీలు వేసుకొని నడి పించాలని సూచించారు. రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్లు నడి పితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్

పిట్లం, జనవరి 23: మండలంలోని నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ అన్నారు. ఆయన మండలంలోని కిష్టాపూర్ గ్రామ నర్సరీలో మొక్కల పెంపకాన్ని మంగళవారం పరిశీలించారు. నర్సరీలో పెంచే ప్రతి మొక్కనూ సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయనవెంట ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి గులాం హుస్సేన్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

గాంధారి, జనవరి 23: మేయడానికి వెళ్లిన గేదె విద్యుత్‌షాక్ తగిలి మృతిచెం దింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారికి చెందిన పత్తి నారాయణ పాడి గేదె మంగళవారం జంగిడిలో కలిసి గ్రామ సమీపం లోని సంగెంరేవు శివారులో మేత కోసం వెళ్లింది. అక్కడ ఓ బోరుబావి వద్ద మేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నారా యణ కోరాడు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ సంజీవ్ పరిశీలించారు.